

ములుగురూరల్: ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దివాకర

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

ములుగురూరల్, సెప్టెంబర్ 9: ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులను అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి కలెక్టర్ స్వీకరించి మాట్లాడారు. మొత్తం 21 దరఖాస్తులు వచ్చాయని, ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై శాఖల వారీగా సమీక్షించి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినా, సీపీవో ప్రకాశ్, అధికారులు ఉన్నారు.

**పోషణమాసం పోస్టర్ ఆవిష్కరణ**

ములుగురూరల్: ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీడబ్ల్యూవో స్వర్ణలత లెనినా ఆధ్వర్యంలో జాతీయ పోషణమాసం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ దివాకర హాజరై అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాస్థాయి అధికారులు, సీడీపీవోలు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

**పల్లె దవాఖానకు రోడ్డు నిర్మించాలి**

ఏటూరునాగారం:మండలంలోని రొయ్యూరు పల్లె దవాఖానకు రోడ్డును వెంటనే నిర్మించాలని ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఈఈని కలెక్టర్ దివాకర ఆదేశించారు. సోమవారం డీఎంహెచ్‌వో అప్పయ్యతో కలిసి దవాఖానను ఆయన సందర్శించి ఏర్పాట్లపై చర్చించారు. దవాఖానకు రోడ్డు, కరెంటు, నీటి సౌకర్యం లేదనే విషయాన్ని గుర్తించారు. వెంటనే సమస్యలు పరిష్కరించి, వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

- ఒక్క అడుగు దూరంలో గణపసముద్రం
- మత్తడి పడుతున్న చెరువులు
- పెరుగుతున్న అన్నారం, మేడిగడ్డ ప్రవాహం

# ఎడతెరిపిలేని వర్షం

జయశంకర్ భూపాలపల్లి. సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ)/ మహదేవపూర్/ వాజేడు/ గణపురం/ వెంకటాపూర్/ కాటారం/ కృష్ణకాలనీ/ కన్నాయిగూడెం : జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఇప్పటికే కురిసిన వర్షాలతో చెరువులు నిండుకుండల్లా మారాయి. పలు చెరువులు మత్తడి పడుతుండగా లోలెవల్ కల్వర్టులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కాళేశ్వరం వద్ద గోదావరి క్రమ క్రమంగా పెరుగుతూనే ఉంది. అన్నారం (సరస్వతి)బరాజ్ నుంచి 4, 02,060 క్యూసెక్కుల వరద వస్తుండగా అధికారులు 66 గేట్ల ద్వారా నీటిని బయటికి పంపిస్తున్నారు. మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్ నుంచి 2,79,670 క్యూసెక్కులు వస్తుండగా బరాజ్ 85 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ఇటీవల 8 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహించగా ఇప్పుడు కొంచెం తగ్గుముఖం పట్టింది. అల్పపీడనం నేపథ్యంలో మళ్లీ పెరిగే అవకాశం ఉంది. కాళేశ్వరం సమీపంలో చంద్రుపల్లి లో లెవల్ కల్వర్టుపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. గణపసముద్రం నీటి సామర్థ్యం 30 అడుగులు కాగా, ఇప్పటికే 29 అడుగులకు చేరింది. మరో అడుగు చేరితే మత్తడిపడి మోరంచ ప్రవాహ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. సోమవారం రాత్రి వర్షం పరిస్థితి ఇలాగే ఉంటే పరిస్థితి విషమించే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెప్తున్నారు. మహదేవపూర్ మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. పెద్దంపేట, కుదురుపల్లి, కొంగల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో పంట పొలాలు, పత్తి చేన్లు నీట మునిగాయి. మండలకేంద్రంలోని శ్రీ మందరగిరి ఆలయ సమీపంలో రహదారిపై భారీగా వరద చేరడంతో ఎస్సీ కాలనీ వాసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దంపేట వాగు ఉధృతిని ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. లోతట్టు గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేశారు. ములుగు జిల్లా వాజేడు మండలం ప్రగళ్లపల్లి గ్రామంలో వాజేడు–వెంకటాపురం మండలాలకు వెళ్లే రాష్ట్రీయ ప్రధాన రహదారి పైకి వరద చేరడంతో వాహనాల రాకపోకలు అందులో నుంచే సాగించాయి. గణపురం మండలం బుద్ధారం వంగపెల్లివాని చెరువు, బాగిర్తిపేట చెరువులు అలుగు పడుతున్నాయి. వెంకటాపూర్ మండలం రామప్ప చెరువుకు భారీగా వరద నీరు వస్తుండంతో నీటి మట్టం 32.5 అడుగులకు చేరుకుంది. లింగాపూర్– జవహర్‌నగర్, వెల్తుర్లపల్లి– నారాయణగిరిపల్లి, పాలంపేట– లక్ష్మీదేవిపేట గ్రామాలో లెవెల్ వంతెనలపై నుంచి వరద ప్రవహిస్తుండంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మిర్చి, పత్తి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాటారం మండలం శంకరంపల్లి, గుండ్రాత్‌పల్లి, పలు చోట్ల పంట పొలాలు నీట మునిగాయి. చింతకాని, కాటారంతో పాటు పలు చెరువులు మత్తడి దూకుతున్నాయి. వర్షంతో పత్తి చేనుల్లోకి నీరు వచ్చి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కన్నాయిగూడెం మండలం కంతనపల్లి చెరువు సమీప ప్రధాన రోడ్డు లోలెవల్ వంతెన పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కన్నాయిగూడెం నుంచి ఏటూరునాగారం వైపుకు పోతున్న వాహనదారులు, 102 వాహనం వరద తగ్గే వరకు అక్కడే ఆగి ఆ తర్వాత వెళ్లిపోయాయి.



మహదేవపూర్ : నీట మునిగిన పంట పొలాలు



కాటారం : శంకరాంపల్లిలో ఇంటి చుట్టూ చేరిన వరద



గణపురం : మత్తడిపడుతున్న వంగపల్లి వాణి చెరువు



వాజేడు : ప్రగళ్లపల్లి గ్రామంలో వాజేడు–వెంకటాపురం వెళ్లే రహదారిపై నిలిచిన నీరు



జలకళతో రామప్ప చెరువు

## భూపాలపల్లి జిల్లాలో 14.8 మి.మీటర్ల వర్షపాతం

భూపాలపల్లి రూరల్ : జిల్లాలో సోమవారం సాయంత్రం 4 గంటల వరకు 14.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మహాముత్తారం మండలంలో 15.5 మి.మీ, మహదేవ్‌పూర్ 19, కాటారం 17.5, మల్హర్‌రావు 17.3, టేకుమట్ల 11.3, మొగుళ్లపల్లి103, చిట్యాల12, రేగొండ 11.3, పలిమెల 39.8, భూపాలపల్లి 13.3, గణపురం 0.8, కొత్తపెల్లిగోరి మండలంలో 10.8 మిల్లీ మీటర్లు నమోదైనట్లు వారు వివరించారు.

## గోదావరికి పెరిగిన వరద

వాజేడు/ కన్నాయిగూడెం : ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు సోమవారం గోదావరి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. దీంతో రాత్రి 8 గంటలకు 15.580 మీటర్ల(48) అడుగులకు నీటిమట్టం చేరుకున్నట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. టేకులగూడెం గ్రామ శివారులోని రేగుమాగు వాగు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై నీరు చేరడంతో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం ఎగువ నుంచి 7,35,740 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బరాజ్ 59 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

# గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

ఏటరునాగారం: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పలు జిల్లాలకు చెందిన గిరిజనులు పీవో చిత్రామిశ్రాకు వినతులు సమర్పించారు. భూమి సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతూ తాడ్వాయి మండలం కామారం గ్రామానికి చెందిన అల్లెం నవీన్, అల్లెం సుజాత, అల్లెం తార వినతిపత్రం అందజేశారు. మండలంలోని చెల్పాకకు చెందిన బీ లలిత, ఆలూరి మమత ఏ ఎన్ ఎంగా నియమించాలని కోరారు. వైద్యారోగ్య శాఖలోని అంబులెన్స్‌లో పనిచేస్తున్న మెడికల్ టెక్నీషియన్స్, డ్రైవర్లకు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రావాల్సిన నాలుగు నెలల వేతనాలు ఇప్పించాలని ఉద్యోగి గణేశ్, మరికొందరు వినతిపత్రం అందజేశారు. గోవిందరావుపేట మండలం రాంనగర్‌కు చెందిన ధరంసోతు సుమలత, వీ అశ్విని జీవనోపాధి కల్పించాలని కోరారు. మండలానికి చెందిన కబ్బాక రామయ్య ఆర్థిక సాయం ఇప్పించాలని కోరారు. ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్రామిశ్రా

# పిచ్చికుక్క దాడిలో తొమ్మిది మందికి గాయలు

మంగపేట, సెప్టెంబర్ 9: మండల కేంద్రంలోని పొదుమూరులో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచింది. పొదుమూరు, ముస్లిం వీధి నుంచి వచ్చిన పిచ్చికుక్క రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన ఎర్రావుల సమ్మయ్య, కొప్పుల లాలయ్య, దాదాని, సైదా, మైతున్ బీ, ఘోరేతో పాటు మరో ముగ్గురిని కరవగా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పీహెచ్‌సీకి తీసుకొచ్చి చికిత్స చేయించారు.

# వాజేడు తహసీల్దార్‌గా వీరభద్రప్రసాద్..!

వాజేడు, సెప్టెంబర్ 9: మండల తహసీల్దార్‌గా డీ వీరభద్రప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ దివాకర సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్‌ను ములుగు కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వీరభద్రప్రసాద్ వచ్చారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. పేరూరు మర్రిమాగు వాగులో ఆదివారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైనా సమచారం ఇవ్వకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు తహసీల్దార్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

## బాల పురస్కారం నామినేషన్లు

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 9 : పీఎం రాష్ట్రీయ బాల పురస్కారం–2025కు ఈనెల 15వ తేదీలోపు https://awards.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అభిరుచి, ప్రతిభ కలిగిన జిల్లాలోని 18 ఏండ్లలోపు బాల బాలికలు అర్హులన్నారు.

## నాణ్యమైన సేవలందించాలి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 9 :ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ మన్ననలు పొందాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంజూర్‌నగర్‌లో ఐడీబీఐ భూపాలపల్లి బ్రాంచి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ రకాల సేవల కోసం బ్యాంకుకు వచ్చే ప్రజలను అతిథులుగా భావించి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వివిధ రంగాలకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కేటీపీపీ సీఈఎం సిద్దయ్య, ఐడీబీఐ జోనల్ సీజీఎం శరత్ కామత్, జోనల్ డిప్యూటీ జీఎం వాసుదేవన్, రీజినల్ మేనేజర్ వెంకటేష్, బ్రాంచ్ మేనేజర్ జాటోత్ భాస్కర్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గణపురం,సెప్టెంబర్ 9: మండల కేంద్రానికి చెందిన అంకం యుగంధర్ ఇటీవల మృతి చెందగా సోమవారం దశదినకర్మ సందర్భంగా 1995–96 టెన్త్ బాల్యమిత్రులు కుటుంబ సభ్యులకు రూ. 33 వేలు ఆర్థిక సాయం అందించారు. బాల్యమిత్రులు ఆకుల దేవేందర్, ఇమ్మడి శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, పలుకల విద్యాసాగర్ రెడ్డి, రవీందర్‌రావు, మామిడి రమణాకర్, వెంకటరెడ్డి, రాజేంద్రప్రసాద్, రమేశ్, శ్రీధర్ రావు, శ్రీనివాస్, యుగంధర్ పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల్లో పర్యటించాలి

**అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం**

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 9 : ప్రభుత్వ యంత్రాంగం లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ వరద పరిస్థితులను పర్యవేక్షించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్ అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం వరద సహాయక చర్యలను పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. చెరువులు అలుగు పోస్తున్నాయని, చెరువుల పటిష్ఠతకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

**దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. మొత్తం 25 దరఖాస్తులు వచ్చాయని, ఆయా శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు చెప్పారు.

# ఘనంగా సేవాలాల్ సేన ఆవిర్భావ వేడుకలు



కృష్ణకాలనీ: జెండా ఆవిష్కరిస్తున్న సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు సురేశ్ నాయక్

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 9 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్సు డిపో ఆవరణలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్యా సురేశ్‌నాయక్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ సంతోష్‌నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన 10వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా రూప్ సింగ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ వాలునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రామ్‌సింగ్ నాయక్, జిల్లాలోని ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

**సేవాలాల్ సేన జెండా ఆవిష్కరణ**

ములుగురూరల్: ములుగు జిల్లా కేంద్రంలో సేవాలాల్ సేన 10వ వార్షికోత్సవాన్ని సేన జిల్లా అధ్యక్షుడు జరుపుల పవన్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సేవాలాల్ సేన జెండాతో పాటు కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామం, మండలం, జిల్లాలో సేవాలాల్ ఆలయ నిర్మాణం కోసం భూమి కేటాయించి నిధులు అందించాలన్నారు. కార్యదర్శి భూక్యా జంపన్న, నాయకులు రాజేశ్, కుమార్, కమలేశ్, లక్ష్మణ్, చందూలాల్, శంకర్‌నాయక్, రతణ్, సారయ్య, కుమార్, చంటి, తులసీరాం, బలరాం పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

భూపాలపల్లిరూరల్, సెప్టెంబర్ 9 : భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీకి చెందిన గాజు రమేశ్ (50) ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతంలో అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని వందపడకల దవాఖానకు తరలించించారు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. కొన్నేండ్ల క్రితం భార్య, సంవత్సరం క్రితం కుమారుడు మరణించడంతో రమేశ్ మనస్తాపానికి గురై తాగుడుకు బానిసయ్యాడన్నారు. ఆదివారం రాత్రి కూడా బాగా తాగి వచ్చి ఇక్కడ పడి చనిపోయి ఉంటాడని వారు తెలిపారు.

## విషజ్వరంతో మహిళ మృతి



సుజాత (ఫైల్)

మంగపేట, సెప్టెంబర్ 9: మండలంలోని కమలాపురం అంబేద్కర్ కాలనీకి చెందిన వంకాయల సుజాత(30) విషజ్వరంతో సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. 20 రోజుల క్రితం సుజాతకు విషజ్వరం రాగా, స్థానికంగా వైద్యం చేయించారు. అయినా నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో కామెర్లు వచ్చి లివర్ డ్యామేజ్ అవగా, పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు.

## రోడ్డుపై కూలిన భారీ చింతచెట్టు

మంగపేట, సెప్టెంబర్9: మండలంలోని కొత్తూరుమొట్లగూడెం –కోమటిపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై సోమవారం సాయంత్రం భారీ చింతచెట్టు కూలింది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ దెబ్బతినగా, స్తంభాలు విరిగిపోయాయి. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి, అనంతరం చెట్టును తొలగించారు. చీకటి పడటంతో విద్యుత్ లైన్ మరమ్మతులు చేయడం వీలు కాలేదు. అధికారులు తాడ్వాయి నుంచి ఉన్న 11 కేవీ లైన్ ద్వారా కొత్తూరు మొట్లగూడేనికి విద్యుత్ సరాఫరా ఏర్పాటు చేశారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

ములుగురూరల్, సెప్టెంబర్ 9: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు డీడబ్ల్యూవో స్వర్ణలతా లెనినా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ సందర్భాల్లో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన చిన్నారులతో పాటు సామాజిక సేవ, పర్యావరణ, క్రీడలు, కళలు, సంస్కృతి, శాస్త్ర, సాంకేతిక అంశాలు, ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన 5–18 సంవత్సరాల పిల్లలు ఈ అవార్డుకు అర్హులన్నారు. https://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94406 15158 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## బిల్టులో ముమ్మరంగా కూల్చివేత పనులు

మంగపేట, సెప్టెంబర్ 9: పల్పు ఉత్పత్తి మార్కెటింగ్ సమస్యతో 2014లో మూతపడిన కమలాపురం బిల్టు కార్మాగారంలో స్క్రాప్ తొలగించే ప్రక్రియలో భాగంగా కూల్చివేత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఫ్యాక్టరీలో వివిధ విభాగాలకు చెందిన భారీ భవనాలను కూల్చివేశారు. సోమవారం సుమారు 50 మీటర్లకుపైగా ఎత్తు ఉన్న భారీ చిమ్నీ, షీటింగ్ విభాగానికి చెందిన భారీ భవనాన్ని బాంబులు పేల్చి కూల్చివేశారు. దసరా వరకు స్క్రాప్ తొలగించే పనులు పూర్తి చేసి, కర్మాగార స్థలాన్ని మరో పరిశ్రమ ఏర్పాటుకు ఐటీసీ సంస్థకు అప్పగించనున్నట్లు తెలుస్తున్నది.

## మాదకద్రవ్యాలపై తనిఖీలు

ములుగురూరల్, సెప్టెంబర్ 9 : ములుగు మండలం జాకారం శివారు అబ్బాపురం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, రామకృష్ణ సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలను చేపట్టామని తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కాటారం, సెప్టెంబర్ 9 : ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కట్కం రమేష్ అన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలపై చర్చించారు. 317 బాధితులకు న్యాయం కోసం, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీల కోసం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రవీందర్, నాయకులు రాజిరెడ్డి, శంకర్, సమ్మయ్య, పరంసింగ్, అనిల్, సతీశ్, మనోజ్, బాలరాజు పాల్గొన్నారు.

## కమలాపురంలో వర్షానికి కూలిన ఇల్లు

మంగపేట, సెప్టెంబర్09: మండలంలోని కమలాపురంలో ఇటీవల కురిసిన వర్షానికి గాజర్ల పెద్దబాబుకు చెందిన ఇల్లు సోమవారం కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని సామగ్రి పూర్తిగా ధ్వంసమైనట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని, పక్కా ఇల్లు మంజూరు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



కూలిన ఇంటి వద్ద బాధిత కుటుంబం

# రైతులందరికీ రుణమాఫీ చేస్తాం

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

కాటారం, సెప్టెంబర్ 9 : అర్హత ఉన్న రైతులందరికీ రుణ మాఫీ చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మండలంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ధన్వాడ దత్తాత్రేయ ఆలయం, వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ధన్వాడ, గంగారం గ్రామంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. గంగారం మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక, బ్యాంక్‌ల్లో ఏర్పడిన సమస్యలను ఆసరా చేసుకొని రాజకీయం చేయడం సరికాదన్నారు. వరదలతో నష్టపోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. దేశంలో బీజేపీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతున్నదని, రానున్న రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందన్నారు.



మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

**విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి**

ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి అన్నారు. గంగారం మోడల్ స్కూల్‌ను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి విద్య, వసతులపై ఆరాతీశారు. ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ధన్వాడ గ్రామంలో ఇటీవల మరణించిన పల్లె రాజవ్వ, తులిసెగారి లింగయ్య, తులిసెగారి సమ్మయ్య, గంగారం గ్రామానికి చెందిన ముల్కళ్ల సమ్మక్క, ముల్కళ్ల మహేష్, తెప్పల బాల్‌రెడ్డి, పోటు సమ్మయ్య కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు తెప్పల దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కడారి విక్రమ్, కుంభం రమేశ్‌రెడ్డి, జాడి రమేశ్, చిట్టూరి మహేశ్, మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో రైతన్న ఆందోళన

గోవిందరావుపేట, సెప్టెంబర్ 9: పది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. మండలంలో వరి సాగు చేసిన రైతులను వర్షాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వర్షంతో పాటు మబ్బులు పడుతుండడంతో వరి పైర్లలో తెగుళ్లు వస్తున్నాయి. వాటి నివారణకు మందులు పిచికారీ చేయాలన్న, పూర్తి స్థాయిలో మబ్బులు కమ్మి, చిరుజల్లులు పడుతుండడంతో అవస్థలు పడుతున్నారు. వరణుడు కరునిస్తే పంటలు బాగుంటాయని ఎదురు చూస్తున్నారు.

## వీధిలైట్లను పునరుద్ధరించాలి

చిట్యాల, సెప్టెంబర్ 9 : మండలంలోని కైలాపూర్ గ్రామంలో వీధిలైట్లను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు. ప్రస్తుత సీజన్ సమయంలో విష పురుగులు తిరుగుతున్నాయని, గ్రామ అంతర్గత రోడ్లు భయానకంగా ఉన్నాయన్నారు. వర్షాలకు లైట్లు వెలగడంలేదని గ్రామ పంచాయతీ పాలకులు చొరవ తీసుకొని ఏర్పాటు చేయాలని కోరారు.

## ఉద్యోగాలకు ఆహ్వానం

గణపురం, సెప్టెంబర్ 9 : జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్లు–14, అసోసియేట్ ప్రొఫెసర్లు–16, అసిస్టెంట్ సీనియర్ రెసిడెంట్లు–35, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ , వెనెరాలజీ, సైకియాట్రీ, జనరల్ సర్జరీ, ఈఎన్టీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ, అనస్థీషియా, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, రెస్పిరేటరీ మెడిసిన్ తదితర ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వ వైద్యకళాశాలలో ఈనెల 12న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. సమాచారం కోసం http://www.gmcbhpl.comలో సంప్రదించాలన్నారు.

## వృద్ధురాలిని ఇంటికి చేర్చిన ఎస్సై

వాజేడు, సెప్టెంబర్ 9: వర్షంలో వణుకుతూ రాత్రంతా పాకలో ఉన్న వృద్ధురాలిని బంధువుల ఇంటికి చేర్చి ఔదార్యం చాటుకున్నారు ఎస్సై రుద్రరాపు హరీశ్. వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లిమండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు అబ్బా మహాలక్ష్మి ఆదివారం రాత్రి జగన్నాథపురం వచ్చింది. వర్షానికి రాత్రంతా రోడ్డు పక్కన పాకలో ఉన్నది. విషయం తెలుసుకున్న ఎస్సై హరీశ్ సోమవారం వృద్ధురాలి వద్ద వివరాలు తెలుసుకొని ఆమె బంధువులకు సమాచారం ఇచ్చి వారితో కన్నాయిగూడెం మండలం గుట్టల గంగారానికి ఆటోలో పంపించేలా ఏర్పాట్లు చేశారు. ఎస్సైని మండల వాసులు అభినందిస్తున్నారు.



బంధువుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై హరీశ్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331762

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

RETIRED POLICE SUB INSPECTOR (SI) కావలెను.
యాడ్ ఏజెన్సీ కోసం సబ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంకులో రిటైర్డ్ పోలీసు అధికారిని కన్సల్టెంట్‌గా నియమించుకోడానికి వెతుకుతున్నాము. నెలవారీ వేతనం నెలకు రూ. 30,000/- నెలలో 10 రోజులు మాత్రమే పని దినాలు.
వివరాల కోసం సంప్రదించండి
Suryodaya Colony Near Kamineni Hospital, LB Nagar Hyderabad-500074
Cell: 8499000333
You Can Also Send your Details to
hrsribalajiads@gmail.com

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565